సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 1 । జూన్ । 2024



చిరు వ్యాపారులకు 'తోడు'గా

జగనన్న తోడు పథకం ద్వారా చిరు వ్యాపారులు ఆర్థికంగా పరిపుష్టి సాధిస్తున్నారు. అప్పులు చేయాల్సిన అవసరం తప్పిందని అంటున్నారు. 10లో ▸



అంతర్ జిల్లా నేరస్తుల అరెస్ట్

ఏలూరు, కోనసీమ జిల్లాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నేరస్తులను తణుకు రూరల్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. 10లో ▸



యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా

కొయ్యలగూడెం రూరల్, జంగారెడ్డిగూడెం రూరల్ ప్రాంతాలు మట్టి అక్రమ రవాణాకు అడ్డాగా మారాయి. మట్టిని యథేచ్ఛగా తవ్వి తరలిస్తున్నారు. 10లో ▸

న్యూస్‌రీల్

డీఈఓకు ఘన వీడ్కోలు



డీఈఓ వెంకటరమణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

భీమవరం: పశ్చిమగోదావరి జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ శ్యామ్ సుందర్, మండల విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయ సంఘ నేతలు డీఈఓ కార్యాలయ సిబ్బంది ఆయనకు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా ప్రజా రవాణా అధికారిగా వరప్రసాద్



భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.వీరయ్య చౌదరి శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. దీంతో ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారిగా పనిచేస్తున్న ఎన్‌వీఆర్ వరప్రసాద్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. భీమవరం జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో ఆయన వీరయ్యచౌదరి నుంచి బాధ్యతలు స్వీకరించారు. పదవీ విరమణ చేసిన వీరయ్యచౌదరిని విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.గోపీనాథ్ రెడ్డి, ఎన్‌వీఆర్ వరప్రసాద్, డిపో మేనేజర్లు, అసోసియేషన్ల నాయకులు, ట్రాఫిక్ సూపర్‌వైజర్లు, మెకానికల్, సెక్యూరిటీ సిబ్బంది సత్కరించారు. పర్సనల్ ఆఫీసర్ ఎల్.గీతా వాణి, ఉమ్మడి జిల్లా కమర్షియల్ మేనేజర్ సుబ్బారావు, అకౌంట్స్ ఆఫీసర్ నరసింహమూర్తి, ఎస్‌వీ రావు, డిపో మేనేజర్లు సత్యనారాయణమూర్తి (భీమవరం), ఎస్.సుబ్బన్నరెడ్డి (నరసాపురం), ఎస్.గిరిధర్‌కుమార్ (తణుకు), ఏలూరు సత్యనారాయణమూర్తి (తాడేపల్లిగూడెం), వాణి (ఏలూరు), గంగాధర్ (జంగారెడ్డిగూడెం), పవన్‌కుమార్ (నూజివీడు), కుమార్ (కొవ్వూరు), శ్రీరామ్‌కుమార్ (నిడదవోలు), సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన సప్లిమెంటరీ పరీక్షలు

భీమవరం: జిల్లాలో ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. ఫస్టియర్ ఒకేషనల్ పరీక్షకు 46.6 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని ఆర్ఐఓ కె.చంద్రశేఖర్‌బాబు తెలిపారు. 181 మందికి 84 మంది హాజరయ్యారన్నారు. అలాగే సెకండియర్ ఒకేషనల్ పరీక్షకు 63 మందికి 34 మంది విద్యార్థులు హాజరయ్యారని, ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.

టెన్త్ పరీక్షకు 45 శాతం.. జిల్లాలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షకు శుక్రవారం 45 శాతం విద్యార్థులు హాజరయ్యారని డీఈఓ ఆర్.వెంకటరమణ తెలిపారు. సోషల్ పరీక్షకు 3,224 మంది విద్యార్థులకు 1,454 మంది హాజరయ్యారన్నారు. జిల్లాలో 21 పరీక్షా కేంద్రాల్లో తనిఖీ చేయగా ఎక్కడా మాల్ ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదన్నారు.

ఏలూరు జిల్లాలో

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు జిల్లాలో టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ముగిశాయి. చివరిరోజు శుక్రవారం సోషల్ స్టడీస్ పరీక్షకు 4,671 మంది విద్యార్థులకు 1,869 మంది హాజరయ్యారు. ఫ్లయింగ్ స్క్వాడ్, జిల్లా విద్యాశాఖాధికారి, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కలిపి మొత్తం 14 పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు చేశారు.

ఇంటర్ పరీక్షలకు 314 మంది..

ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ ఒకేషనల్ బ్రిడ్జి కోర్సు పరీక్షలు ఏలూరు జిల్లాలోని 10 కేంద్రాల్లో జరిగాయి. ఉదయం ఫస్టియర్ విద్యార్థులు 254 మందికి 151 మంది, మధ్యాహ్నం సెకండియర్ విద్యార్థులు 205 మందికి 163 మంది హాజరయ్యారు. మొత్తంగా 459 మందికి 314 మంది హాజరయ్యారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగలేదని పరీక్షల కన్వీనర్ బి.ప్రభాకరరావు తెలిపారు.

డీసెట్‌లో ఫస్ట్ ర్యాంక్



కేశన మీనాక్షి

నిడమర్రు: ఏలూరు జిల్లా నిడమర్రు మండలం దేవరగోపవరం గ్రామానికి చెందిన కేశన మీనాక్షి శుక్రవారం విడుదలైన డీసెట్–2024 ఫలితాల్లో భౌతికశాస్త్ర విభాగంలో రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించింది. ప్రస్తుతం మీనాక్షి కృష్ణా జిల్లా పామర్రులోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. ఆమె తండ్రి సూర్యచంద్రరావు వ్యవసాయ కూలీ, తల్లి సునీత గృహిణి. పెదనింద్రకొలనులోని ఉన్నత పాఠశాలలో ఆమె పదో తరగతి పూర్తి చేసింది. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, పెదనింద్రకొలను జెడ్పీ స్కూల్ ఉపాధ్యాయులు మీనాక్షికి అభినందనలు తెలిపారు.

కౌంటింగ్‌కు రెడీ

- కౌంటింగ్ హాళ్లు సిద్ధం
- నో ఫ్లయింగ్ జోన్స్‌గా లెక్కింపు కేంద్రాలు
- అధికారులు సర్వ సన్నద్ధం



కంటింగ్‌కు సిద్ధం.. విష్ణు కళాశాలలో ఈవీఎంలో ఓట్లు లెక్కించేందుకు సిద్ధం చేసిన కౌంటింగ్ హాల్

ఉత్కంఠగా ఎదురుచూస్తున్న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు మూడు రోజుల సమయం మాత్రమే ఉంది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ నియోజకవర్గ స్థానాలకు గాను ఈవీఎంలు భద్రపర్చిన భీమవరంలోని శ్రీవిష్ణు, ఎస్ఆర్‌కేఆర్ కళాశాలల్లో కౌంటింగ్‌కు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ ఏర్పాట్లుచేశారు. ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కించేందుకు బారికేడ్లు, ఇనుప మెస్‌లతో కౌంటింగ్ హాళ్లను సిద్ధం చేయించారు. పోలింగ్ తరహాలోనే కౌంటింగ్ విజయవంతం చేసేందుకు కలెక్టర్ నేతృత్వంలో జిల్లా అధికార యంత్రాంగం తీవ్రంగా శ్రమిస్తోంది. మరోపక్క అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ డాక్టర్ అజిత కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. మునుపెన్నడూ లేనివిధంగా ఈసారి కౌంటింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక నిబంధనలు అమలుచేస్తున్నారు. రెండు కేంద్రాలను నో ఫ్లై జోన్స్‌గా ప్రకటించారు. నిబంధనలకు విరుద్ధంగా డ్రోన్లు ఎగురవేస్తే చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరికలు జారీచేశారు. కేంద్రాల వద్ద ఏర్పాట్లలో పాల్గొంటున్న సిబ్బందిని సైతం క్షుణ్ణంగా పరిశీలించాకే లోపలికి అనుమతిస్తున్నారు.

– సాక్షి, భీమవరం



కట్టుదిట్టంగా.. స్ట్రాంగ్ రూం వద్ద పోలీస్ బందోబస్తు



పక్కాగా వివరాల నమోదు.. విష్ణు కళాశాల ఎంట్రన్స్ గేట్ వద్ద కౌంటింగ్ హాళ్ల వద్దకు వెళ్లే రెవెన్యూ సిబ్బంది వివరాలు నమోదు చేసుకుంటున్న పోలీసులు



ఏర్పాట్లు షురూ.. కౌంటింగ్ హాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల



పోస్టల్ బ్యాలెట్ ఓట్ల కోసం.. విష్ణు కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కించేందుకు సిద్ధం చేసిన కౌంటింగ్ హాల్



భద్రతలో రాజీ లేదు.. కౌంటింగ్ హాల్ వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏలూరు రేంజి ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ డాక్టర్ అజిత

సమన్వయంతో కౌంటింగ్ విధులు

కలెక్టర్ సుమిత్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

భీమవరం (ప్రకాశంచౌక్): కౌంటింగ్ సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్లు సులువుగా కౌంటింగ్ కేంద్రాల వద్దకు చేరుకోవడానికి పటిష్ట ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక వశిష్ట సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ అజిత వేజెండ్లతో కలిసి కౌంటింగ్ ఏర్పాట్లపై సమీక్షించారు. కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవడానికి రూట్‌మ్యాప్‌లను రూపొందించి, పార్కింగ్ ప్రదేశాల సమాచారాన్ని అందించాలని కలెక్టర్ ఆదేశించారు. దీనిపై సిబ్బందికి పూర్తి అవగాహన కల్పించాలన్నారు. కొవ్వాడ అన్నవరం సెంటర్ నుంచి కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లకు విష్ణు కాలేజీ మెయిన్ గేటు వరకు చేరుకోవడానికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామన్నారు. మీడియా ప్రతినిధులు కూడా ఇదే వాహనాల్లో మీడియా సెంటర్‌కు చేరుకోవాల్సి ఉంటుందన్నారు. అలాగే ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కాలేజీ కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవడానికి నాగరాజు మాల్, ఎన్టీఆర్ విగ్రహం వద్ద బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ట్రాఫిక్ మళ్లింపు వివరాలు తెలియజేస్తామన్నారు. పోలీస్ సెక్యూరిటీ కల్పించిన పోటీలో ఉన్న అభ్యర్థులకు, రిటర్నింగ్ అధికారులకు మాత్రమే కౌంటింగ్ సెంటర్ వరకు వాహనాలలో అనుమతి ఉంటుందన్నారు. పోలింగ్ సిబ్బంది కేంద్రాల వద్దకు ఉదయం 6 గంటలకే చేరుకోవాలన్నారు. అధికారులు, పోలీసులు సమన్వయంతో లెక్కింపు ప్రక్రియ పూర్తిచేయాలని కోరారు. జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల మాట్లాడుతూ పోలీసు సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలన్నారు. కౌంటింగ్ రోజున గెలిచిన అభ్యర్థులు విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా కాల్పులకు అనుమతి లేదన్నారు. జిల్లా అదనపు ఎస్పీ వి.భీమారావు, రిటర్నింగ్ అధికారులు సీవీ ప్రవీణ్ ఆదిత్య, వి.స్వామినాయుడు, ఎం.అచ్యుత అంబరీష్, కె.శ్రీనివాసులు రాజు, బి.వెంకటరమణ, కె.చెన్నయ్య, బి.శివనారాయణ రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్, డీఎస్పీలు జి.శ్రీనివాస రావు, డీఎస్ఆర్ఎస్ఎస్ మూర్తి, వి.నారాయణ స్వామి రెడ్డి, ఎన్నికల సూపరింటెండెంట్ చందన దుర్గాప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.

పారిజాతగిరి.. ఆధ్యాత్మిక సిరి

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



శ్రీవారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలోని గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. నాలుగో రోజు శుక్రవారం ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచన కార్యక్రమాలు నిర్వహించి యాగశాలలో విశేష హోమాన్ని జరిపించారు. అనంతరం ఆలయ కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవమూర్తులకు ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని జరిపించారు. భక్తుల గోవింద నామ స్మరణలతో వేడుక నేత్రపర్వంగా సాగింది. ఉభయదారులుగా రెడ్డి రంగ ప్రసాదరావు కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఆలయ ఈఓ మానికల రాంబాబు, ఆలయ అభివృద్ధి కమిటీ, ధర్మకర్తల మండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసునికి చంద్రప్రభ వాహనంపై తిరువీధి ఉత్సవం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా అభినయ కూచిపూడి నాట్య అకాడమీ రూపాదేవి శిష్య బృందం అన్నమాచార్య కీర్తనల నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు.. శనివారం ఉదయం యజ్ఞ కార్యక్రమాలు, సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసునికి గరుడ వాహనంపై జంగారెడ్డిగూడెం పట్టణంలో తిరువీధి ఉత్సవం నిర్వహిస్తామని ఈఓ రాంబాబు తెలిపారు.

మద్దిలో హనుమద్ జయంతి ఉత్సవాలు



సువర్చలా హనుమద్ కల్యాణం జరిపిస్తున్న దృశ్యం



నిజరూప దర్శనంలో స్వామివారు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం మద్ది అంజనేయస్వామి క్షేత్రంలో హనుమద్ జయంతి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామి నిజరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అలాగే స్వామి వారి జన్మ నక్షత్రం పూర్వాభాద్ర నక్షత్రం కావడంతో సువర్చలా హనుమద్ కల్యాణాన్ని జరిపించారు. అలాగే విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, మృత్సంగ్రాహణం, వాస్తు పూజ, యాగశాల, అగ్ని ప్రతిష్ఠ, ప్రధాన హోమాలు, ధ్వజారోహణ వంటి విశేష కార్యక్రమాలు నిర్వహించారు. జంగారెడ్డిగూడెం సీఐ రాజేష్, ఆలయ ఈఓ ఆకుల కొండలరావులతో కలిసి ఉత్సవ ఏర్పాట్లు పరిశీలించారు. ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు ఉన్నారు.

ఉత్సవాల్లో నేడు : శనివారం హనుమద్ జయంతి సందర్భంగా స్వామి వారికి లక్ష తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నామని ఈఓ కొండలరావు తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి స్వామివారికి ప్రభాత సేవ, నిత్యార్చనలు జరుగుతాయని, సాయంత్రం 6 గంటల నుంచి సాయంకాల హోమాలు, బలిహరణ, నీరాజన మంత్ర పుష్పాల క్రతువు వంటి పూజాదికాలు నిర్వహిస్తామని ఆయన చెప్పారు.

22 నుంచి జ్యోతిర్లింగ యాత్ర



ఏలూరు (టూటౌన్): భారతీయ రైల్వే అనుబంధ సంస్థ ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో జూన్ 22 నుంచి 30 వరకు జ్యోతిర్లింగ యాత్ర నిర్వహించనున్నట్టు ఏరియా మేనేజర్ ఎం.రాజా శుక్రవారం ప్రకటనలో తెలిపారు. దివ్య దక్షిణ యాత్ర విత్ జ్యోతిర్లింగ పేరుతో నిర్వహించే ఈ యాత్రలో అరుణాచలం, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, తిరుచ్చి, తంజావూరు వంటి పుణ్యక్షేత్రాలను దర్శించవచ్చన్నారు. ఈనెల 22న సికింద్రాబాద్ నుంచి బయలు దేరి విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు స్టేషన్లలో రైలు ఆగుతుందని తెలిపారు. స్లీపర్ క్లాస్ టికెట్ ధర రూ.14,250, థర్డ్ ఏసీ టికెట్ ధర రూ.21,900, సెకండ్ ఏసీ టికెట్ ధర రూ.28,450గా నిర్ణయించామని చెప్పారు. టికెట్ల కోసం విజయవాడ రైల్వే స్టేషన్‌లోని ఐఆర్‌సీటీసీ కార్యాలయంలో నేరుగా లేదా వెబ్‌సైట్ లేదా ప్రవీణ్ సెల్ 92814 95848, బాలాజీ సెల్ 82879 32312 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు.

ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత విద్య

- జిల్లాలో 3,037 మంది దరఖాస్తులు
- ఇప్పటికే 1,456 మందికి ప్రవేశాలు
- రెండు, మూడు విడతల్లో మరికొందరికి అవకాశం



ప్రైవేట్ కాన్వెంట్‌లో విద్యార్థులు (ఫైల్)

భీమవరం: విద్యారంగానికి పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు సైతం కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉచిత విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓ పక్క నాడు–నేడులో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు విద్యాహక్కు చట్టం ద్వారా ప్రైవేట్ స్కూళ్లలోనూ ఉచిత విద్య అందించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో గతేడాది జిల్లాలోని 19 మండలాల్లో 1,162 మంది విద్యార్థులు ఉచిత విద్యకు అర్హత సాధించగా.. ప్రస్తుత విద్యా సంవత్సరంలో (2024–25)లో ఇప్పటివరకు 1,456 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. ఒకటో తరగతిలో ప్రవేటు స్కూళ్లలో చేరే విద్యార్థులకు ప్రభుత్వమే ఫీజులు చెల్లిస్తుంది. దీంతో పేద పిల్లలకు కార్పొరేట్ విద్య ఉచితంగా అందుతోంది.


జిల్లాలోని 353 విద్యాసంస్థల్లో..

జిల్లావ్యాప్తంగా 563 ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఉండగా 353 స్కూళ్లు ఉచిత విద్యను అందించేందుకు రిజిస్టర్ చేసుకున్నాయి. ఆయా స్కూళ్లలో సీట్ల సంఖ్యలో 25 శాతం ప్రభుత్వం కల్పించే ఉచిత విద్యకు కేటాయించనున్నారు. 5 ఏళ్లు నిండిన వారికి మాత్రమే ఒకటో తరగతిలో ప్రవేశం కల్పిస్తుండగా రిజర్వేషన్ల ప్రాతిపదికన సీట్లను బాలికలు, హెచ్ఐవీ బాధిత పిల్లలు, దివ్యాంగులకు 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బీసీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు 6 శాతం కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఏడాదిలో ఉచిత విద్యకు జిల్లాలో 3,555 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకోగా వారిలో 3,037 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఇప్పటికే 1,456 మంది చిన్నారులు ప్రవేశాలు పొందారు. మిగిలిన వారికి రెండు, మూడు విడతల్లో అడ్మిషన్లు కల్పించనున్నారు.

ప్రవేశాలు పొందిన విద్యార్థులు

మండలం	విద్యార్థులు	మండలం	విద్యార్థులు
భీమవరం	209	నరసాపురం	145
తాడేపల్లిగూడెం	169	పాలకోడేరు	52
పాలకొల్లు	154	పెంటపాడు	46
ఆచంట	40	పెనుగొండ	78
ఆకివీడు	44	పెనుమంట్ర	55
అత్తిలి	40	పోడూరు	32
యలమంచిలి	41	తణుకు	138
ఇరగవరం	31	ఉండి	49
కాళ్ల	43	వీరవాసరం	61
మొగల్తూరు	29	మొత్తం	1,456

మొదటి విడతలో 1,456 మందికి..



విద్యాహక్కు చట్టం ద్వారా పేద విద్యార్థులకు ప్రభుత్వం ప్రైవేట్ విద్యాసంస్థల్లో ప్రవేశాలు కల్పిస్తోంది. జిల్లాలో మొదటి విడతలో 1,456 మంది అడ్మిషన్లు పొందారు. వివిధ స్కూళ్లకు విద్యార్థులను లాటరీ ద్వారా పారదర్శకంగా ఎంపిక చేస్తున్నాం. జిల్లాలో 3,037 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇలా ప్రవేశాలు పొందిన విద్యార్థుల నుంచి విద్యాసంస్థలు ఎలాంటి ఫీజులు వసూలు చేయరాదు. వీటి పర్యవేక్షణను మండల విద్యాశాఖ అధికారులకు అప్పగించాం.

– పి.శ్యామ్‌సుందర్, జిల్లా సమగ్రశిక్షా అదనపు ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్, భీమవరం

క్లుప్తంగా

వ్యవసాయ డిప్లమో కోర్సులకు నోటిఫికేషన్ విడుదల


ఏడీఆర్ శ్రీనివాస్

పెనుమంట్ర: ఆచార్య ఎన్జీ వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా నిర్వహించే వ్యవసాయ డిప్లమో కోర్సులకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు మార్టేరు వ్యవసాయ పరిశోధనా సంస్థ ఏడీఆర్ డాక్టర్ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఈ కోర్సు కోసం దరఖాస్తు చేసుకోవడానికి పదో తరగతి విద్యార్హత అని, ఇంటర్ ఫెయిల్ ఐన విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 2023 ఆగస్టు 31 నాటికి 15 నుంచి 22 సంవత్సరాలు మధ్య వయస్సు కలిగి ఉండాలని తెలిపారు. 2022 ఆగస్టు 31 నుంచి 2009 ఆగస్టు 31లోపు జన్మించి ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఇంగ్లిషు చదివిన వారికి, మున్సిపాలిటీలలో చదివిన వారికి 75–25 నిష్పత్తిలో సీట్లు కేటాయింపు ఉంటుందని వివరించారు. జూన్ 1 నుంచి 20 వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చని మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏన్జీఆర్ఏయూ.ఏసీ.ఇన్ సందర్శించాలని సూచించారు. స్థానికులు ఎవరికైనా సందేహాలు ఉంటే పరిశోధనా స్థానంలో నేరుగా సంప్రదించవచ్చన్నారు. కార్యాలయ వేళల్లో 08819–297297 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చని సూచించారు.

ధర్మాజీగూడెంలో డ్వాక్రా మహిళల ఆందోళన


ధర్మాజీగూడెం స్టేట్ బ్యాంక్ వద్ద ఆందోళన చేస్తున్న చంద్రన్నపాలెం డ్వాక్రా మహిళలు

లింగపాలెం: డ్వాక్రా సంఘాల పొదుపు నుంచి సుమారు రూ.20 లక్షల నగదు మాయమయ్యాయంటూ లింగపాలెం మండలం మఠంగూడెం పంచాయతీ శివారు సుంధరావుపేట గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళలు శుక్రవారం ధర్మాజీగూడెం స్టేట్ బ్యాంక్ వద్ద ఆందోళన చేపట్టారు. మాకు తెలియకుండా మా గ్రామానికి చెందిన సీఏ పొదుపు అకౌంట్‌లో నుంచి సుమారు రూ.20 లక్షలకు పైగా డ్రా చేసిందని ఆరోపించారు. రుణమాఫీ సొమ్ము జమైందా? అని సదరు సీఏను ఎప్పుడు అడిగినా పడలేదని చెప్పడంతో శుక్రవారం తనిఖీ నిమిత్తం బ్యాంకుకు వచ్చిన మహిళలకు ఈ విషయం తెలిసింది. సదరు సీఏ కొంత నగదును తన సొంత అకౌంటుకు, మరికొంత నగదు గ్రామ సంఘం అకౌంటుకు జమ చేసినట్లు అధికారులు తెలిపారని, మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై అధికారులు స్పందించి తమకు నగదును ఇప్పించి, న్యాయం చేయాలని మహిళలు కోరారు.

చిరు వ్యాపారులకు ‘తోడు’గా

- ‘జగనన్న తోడు’తో ఆర్థిక భరోసా
- వడ్డీ లేని రుణంతో పెట్టుబడి సమస్య దూరం


కూరగాయల వ్యాపారం నిర్వహిస్తున్న చిరు వ్యాపారి

ఏలూరు (టూటౌన్) : జగనన్న తోడు పథకం ద్వారా చిరు వ్యాపారులు ఆర్థికంగా పరిపుష్టి సాధిస్తున్నారు. వడ్డీ లేకుండా తమకు అందిస్తున్న రూ.10 వేలు ఆర్థిక సహకారంతో తాము ప్రైవేటు అప్పులను ఆశ్రయించాల్సిన అవసరం లేకుండా తమ సొంత కాళ్లపై తాము నిలబడేందుకు ఉపయోగపడిందని చెబుతున్నారు. అన్ని వర్గాల ప్రజలను ఆదుకునే కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న తోడు పథకాన్ని 2020లో ప్రవేశపెట్టారు. ఈ పథకం ద్వారా వీధి వ్యాపారులు, రోడ్డు పక్కన, బహిరంగ ప్రదేశాల్లో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేవారు అంటే కూరగాయాలు, టిఫెన్ సెంటర్లు వంటి రోజు వారీ వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులుతో పాటు సంప్రదాయ వృత్తులు చేసుకుని జీవనం సాగించే లేసు వర్కు పనివారు, కళంకారి, ఏటికొప్పాక,కొండపల్లి బొమ్మలు, లెదర్ వస్తువులు తయారీ, బొబ్బిలి వీణ, బ్రాస్ క్రాఫ్ట్ వంటి పనులు చేసే వారికి ప్రయోజనం చేకురింది. అర్హులైన వ్యాపారులకు బ్యాంకుల ద్వారా నేరుగా రూ.10 వేలు వడ్డీలేని రుణం పొందేలా ఏర్పాట్లు చేశారు. వ్యాపారులు చెల్లించాల్సిన వడ్డీని ప్రభుత్వమే చెల్లించే విధంగా వడ్డీ రాయితీని అందజేస్తున్నారు. ఈ పథకంలో ఇప్పటి వరకూ 8 విడతలు వడ్డీలేని రుణాలు అందించడంతో పాటు, వడ్డీ రాయితీ సొమ్మును సైతం జమ చేశారు. వ్యాపారులు తాము తీసుకున్న రూ.10 వేలును ఏడాది లోపు కచ్చితంగా చెల్లించిన వారికి ప్రభుత్వం వడ్డీ రాయితీని అందజేసింది. దీంతో చిరు వ్యాపారులు సొంతంగా వ్యాపారాల్లో నిలదొక్కుకున్నారు.

ఎనిమిది విడతల్లో రూ.194.66 కోట్లు అందజేత

జగనన్న తోడు పథకంలో 8వ విడతల్లో 1,93,070 మందికి రూ.194.66 కోట్లు మేరకు లబ్ధి చేకూరింది. మొదటి నాలుగు విడతల్లో ఉమ్మడి పశ్చిగోదావరి జిల్లా పరిధిలో 1,31,279 మందికి రూ.131.27 కోట్లను జగనన్న తోడు పథకంలో అందించారు. జిల్లాల విభజన అనంతరం ఏలూరు జిల్లా పరిధిలో 5వ విడత నుండి 8వ విడత వరకూ 61,791 మందికి రూ.61.80 కోట్లు అందించారు.

జగనన్న తోడు సహకారం ఇలా

జిల్లా పేరు	ఫేజ్	లబ్ధిదారులు	లబ్ధి పొందిన మొత్తం
ఉమ్మడి పశ్చిమ గోదావరి	1వ విడత	56,006	రూ.56.00 కోట్లు
	2 వ విడత	25,321	రూ.25.32 కోట్లు
	3,4 విడతలు	49,952	రూ.49.95 కోట్లు
ఏలూరు జిల్లా	5వ విడత	17,721	రూ.17.20 కోట్లు
	6 వ విడత	6,733	రూ. 6.73 కోట్లు
	7వ విడత	21,048	రూ.21.05 కోట్లు
	8వ విడత	16,289	రూ.16.29 కోట్లు
		1,93,070	రూ.193.07 కోట్లు

కొండంత అండ



మాలాంటి వీధి వ్యాపారులకు జగనన్న తోడు పథకం కొండంత అండనిచ్చింది.ప్రైవేటు అప్పులు చేయాల్సిన బాధ తప్పింది. క్రమం తప్పకుండా రుణాన్ని చెల్లించి వడ్డీ రాయితీని పొందే అవకాశం ఏర్పడింది. వీధి వ్యాపారాలు చేసుకునే మాలాంటి వారికి ప్రభుత్వం అందజేస్తున్న సహకారం మరువలేనిది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– జొన్నకూటి గంగరాజు, కూరగాయల వ్యాపారి, ఏలూరు

ప్రైవేటు అప్పుల బాధ తప్పింది



జగనన్న తోడు పథకం ద్వారా బ్యాంకులు వడ్డీలేని రుణం రూ.10 వేలు అందిస్తుండటంతో మాకు ప్రైవేటు అప్పులు చేసే బాధ తప్పింది. క్రమం తప్పకుండా బ్యాంకుల్లో తీసుకున్న రుణాన్ని నెలవారీ చెల్లిస్తుండడంతో బ్యాంకులు సైతం పిలిచి రుణాలు అందిస్తున్నాయి. దీంతో మా కాళ్ల మీద మేము నిలబడి స్వయం సమృద్ధి సాధించేందుకు జగనన్న తోడు దోహదపడింది. ఇంత మంచి పథకాన్ని ప్రవేశ పెట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు.

– సీహెచ్ వెంకటలక్ష్మి, చిరు వ్యాపారి, ఏలూరు

జాతీయ కాన్ఫరెన్స్‌లో ఉద్యానవర్సిటీ విద్యార్థులు


కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న విద్యార్థులు, శాస్త్రవేత్తలతో వీసీ డాక్టర్ టి.జానకిరామ్

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ టి.జానకిరామ్ సహకారంతో, ప్రోత్సాహంతో ముగ్గురు పీహెచ్‌డీ, ఇద్దరు ఎంఎస్సీ విద్యార్థులు, ఇద్దరు అధ్యాపకులు గుజరాత్ జునాగడ్‌లో ఈ నెల 28 నుంచి 31 వరకు నిర్వహించిన నేషనల్ కాన్ఫరెన్స్ పారడిజం అండ్ డైనమిక్స్ ఆఫ్ డిజిటల్ హార్టికల్చర్ ఫర్ ఫుడ్, న్యూట్రిషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో పాల్గొన్నారు. విద్యార్థులు వారి రీసెర్చ్ వర్క్‌లను పోస్టర్ ప్రదర్శన, ఓరల్ ప్రజెంటేషన్ ఇచ్చారు. పీహెచ్‌డీ విద్యార్థిని ఎం.సంధ్యారాణి ఉత్తమ ఓరల్ ప్రజెంటేషన్‌కి గానూ, శాస్త్రవేత్త డాక్టర్ ఎల్.ముకుంద లక్ష్మి ఉత్తమ పోస్టర్ ప్రదర్శనకి గానూ అవార్డులు అందుకున్నారు. అవార్డు అందుకున్న విదార్థిని, శాస్త్రవేత్తను అభినందించారు. జానకిరామ్ మాట్లాడుతూ విద్యార్థులను కూడా వేరు వేరు కాన్ఫరెన్స్‌లకు పంపి ప్రోత్సహిస్తామని చెప్పారు. విద్యార్థులు ప్రగతిని గుర్తించి కాన్ఫరెన్స్‌కు పంపిన వైస్ ఛాన్సలర్ జానకిరామ్‌ను, పీజీ డీన్ డాక్టర్ ఎస్.సూర్యకుమారి, అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.వినయకుమార్‌రెడ్డిలకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ఏలూరు, తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్ల తనిఖీ


ఏలూరు రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న ప్లాట్‌ఫాం పనులను పరిశీలిస్తున్న డీసీఎం వి.రాంబాబు

ఏలూరు (టూటౌన్): ప్రయాణికులకు మెరుగైన సేవలు, మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని విజయవాడ డివిజన్ సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు అధికారులను ఆదేశించారు. కమర్షియల్ విభాగం అధికారులతో కలసి శుక్రవారం ఆయన ఏలూరు, తాడేపల్లిగూడెం స్టేషన్‌లలో విస్తృతంగా తనిఖీలు చేపటారు. ముందుగా ఏలూరు స్టేషన్‌లోని ప్లాట్‌ఫాంలు, టాయిలెట్‌లు, వెయిటింగ్ హాళ్లు, ప్రయాణికుల సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు, లైటింగ్, సూచికల బోర్డులు, నీటి సరఫరా, పరిశుభ్రత నిర్వహణను పరిశీలించారు. క్యాటరింగ్ స్టాల్స్‌లో ఆహార నాణ్యత, పరిమాణం, ప్యాకింగ్‌పై గడువు తేదీలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి పురోగతిపై అధికారులతో మాట్లాడారు. అనంతరం తాడేపల్లిగూడెం స్టేషన్‌కు చేరుకుని బుకింగ్ కార్యాలయం, గూడ్స్ షెడ్, లోడింగ్ పాయింట్, పార్శిల్ కార్యాలయాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో సీసీఐ డి.కిరణ్, ఏలూరు స్టేషన్ మేనేజర్ ఎస్వీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

యలమంచిలి: మండలంలోని మేడపాడు గ్రామానికి చెందిన వర్థినీడి వెంకట భాస్కరరావు అలియాస్ శ్రీనివాస్ (45) పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కాకి శివనారాయణ తెలిపారు. ఈ నెల 25న బరకం కోసం గ్రామంలోని మరొక వ్యక్తితో శ్రీనివాస్‌కు గొడవ జరిగింది. దీంతో మనస్థాపానికి గురైన భాస్కరరావు అదే రోజు పురుగు మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతనిని పాలకొల్లులోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స చేసి మరింత మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి మరణించాడు. ఈ మేరకు మృతుని కుమారుడు కార్తీక్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కాకి శివనారాయణ తెలిపారు.

ఇద్దరు అంతర్‌జిల్లా నేరస్తుల అరెస్టు


నిందితులను అరెస్టు చేసి వివరాలు వెల్లడిస్తున్న తణుకు సీఐ నాగేశ్వరరావు

తణుకు : ఏలూరు, కోనసీమ జిల్లాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నేరస్తులను తణుకు రూరల్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని పగటి సమయంలో రెక్కీ నిర్వహించి రాత్రి సమయాల్లో దోపిడీకు పాల్పడడం వీరి నైజం. ఇలా ఆరు నెలల కాలంలో 15 ఇళ్లల్లో దోపిడీ చేశారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో దొంగతనాలు చేసిన భీమవరం పట్టణానికి చెందిన పందిరి వెంకటనారాయణ అలియాస్ బుజ్జి, తణుకు పట్టణానికి చెందిన నగరపు ఈశ్వరరావులను అరెస్టు చేసి వారి వద్ద రూ.47 లక్షల విలువైన 600 గ్రాముల బంగారు ఆభరణాలతోపాటు 13 కిలోల వెండి ఆభరణాలు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం తణుకు రూరల్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రూరల్ సీఐ జీవీవీ నాగేశ్వరరావు వివరాలు వెల్లడించారు. పందిరి వెంకట నారాయణ బాల్యం నుంచి దొంగతనాలను ప్రవృత్తిగా ఎంచుకుని ఎన్నోసార్లు జైలు జీవితం గడిపాడు. ఇదే క్రమంలో ఒక చోరీకు సంబంధించి రాజమహేంద్రవరం జైలులో ఉండగా ఒక హత్య కేసులో అదే జైలుకు వచ్చిన నగరపు ఈశ్వరరావుతో పరిచయం పెంచుకున్నాడు. ఈ క్రమంలో గతేడాది అక్టోబరులో జైలు నుంచి బెయిల్‌పై వచ్చిన వెంకటనారాయణ అప్పటికే బయట ఉన్న ఈశ్వరరావుతో కలిసి చోరీలు చేయడం ప్రారంభించారు. ప్రత్యేకంగా తయారు చేయించుకున్న రెండు ఇనుప రాడ్‌లు, స్క్రూడ్రైవర్ సాయంతో చెరో మోటారు సైకిల్‌పై తిరుగుతూ రెక్కీలు నిర్వహించేవారు. ఇలా తణుకు రూరల్ పోలీసు స్టేషన్‌తోపాటు పాలకోడేరు, పెనుమంట్ర, గణపవరం, ఉండ్రాజవరం, పెరవలి, అంబాజీపేట, రావులపాలెం, అయినవల్లి, రాజోలు, కొత్తపేట, అమలాపురం పోలీసు స్టేషన్ల పరిధిలో 15 చోరీలకు పాల్పడ్డారు. అయితే శుక్రవారం తణుకు పట్టణ పరిధిలోని అజ్జరం రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతున్న వెంకటనారాయణ, ఈశ్వరరావులను అదుపులోకి తీసుకుని విచారించగా పాతనేరస్తులుగా నిర్ధారించారు. పోలీసులు తమదైన శైలిలో విచారించగా చేసిన నేరాలను ఒప్పుకున్నారు. నిందితుల వద్ద బంగారు ఆభరణాలతోపాటు వెండి వస్తువులు, రెండు బైక్‌లును స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ సమావేశంలో తణుకు రూరల్, ఇరగవరం ఎస్సైలు కె.చంద్రశేఖర్, డి.ఆదినారాయణలు పాల్గొన్నారు. ఈ కేసులో సహకరించిన అత్తిలి హెడ్ కానిస్టేబుల్ ఎస్.యల్లారావు, ఇరగవరం కానిస్టేబుళ్లు షేక్ అన్వర్, మలక శ్రీనివాస్, ఎం.నాగశ్రీనివాస్, ఎం.లక్ష్మణరావు, తణుకు రూరల్ కానిస్టేబుల్ కె.రుద్రేశ్వరరావులను అభినందించారు.

గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి



భీమవరం: భీమవరం టుటౌన్ పోలీసుస్టేషన్ పరిధి గరగపర్రు రోడ్డులోని డీమార్ట్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం మరణించినట్లు పోలీసులు తెలిపారు. సుమారు 40 ఏళ్లవయస్సు కలిగిన మృతుడు ముక్కు పొడుం రంగు ఫ్యాంట్, నీలం రంగు టీషర్ట్ ధరించి ఉన్నాడన్నారు. అనుమానస్పద స్థితిలో మృతదేహం ఉందని, ఆచూకీ తెలిసిన వారు 94407 96634 నంబర్‌కు ఫోన్ చేయాలని పోలీసులు కోరారు.

లారీ క్లీనర్ అనుమానాస్పద మృతి

ఏలూరు టౌన్: నగరంలో ఒక లారీలో నిద్రిస్తున్న లారీ క్లీనర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. నెల్లూరు జిల్లా ఇందుకూరికోట ప్రాంతానికి చెందిన తలారి శ్రీనివాసరావు (40) లారీ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. ఏలూరు గూడ్స్ షెడ్ రోడ్డు వద్ద ఈ నెల 30న లారీని నిలిపివేసి నిద్రించాడు. డ్రైవర్ వచ్చి ఉదయం చూసే సరికి మృతి చెంది ఉన్నాడు. ఈ సంఘటనపై ఏలూరు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో టూటౌన్ సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏలూరు జీజీహెచ్‌లో లారీ క్లీనర్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

లైంగిక దాడి ఘటనలో నిందితుడిపై కేసు

ముసునూరు: గేదెలను తోలుకొని తోటలోకి వెళ్లిన మహిళపై లైంగిక దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.వాసు తెలిపారు. మండలంలోని సూరేపల్లికి చెందిన ఓ దళిత మహిళ గురువారం ఉదయం తన నాలుగు గేదెలను కొత్తపోల్లలో మేతకు తోలుకెళ్లింది. కాసేపటికి గ్రామానికే చెందిన కొండపల్లి చెన్నారావు అక్కడకు వచ్చి ఒక్కసారి తన కోర్కె తీర్చాలంటూ,ఆమె చీర లాగి, లైంగిక దాడికి ప్రయత్నించాడు.ఆమె గట్టిగా కేకలు వేసినా ఎవరూ ఆ ప్రాంతంలో లేకపోవడంతో అతను మరింత రెచ్చిపోయి,కేకలు వేస్తే చంపేస్తానంటూ, ఆమె జుట్టు పట్టుకుని నిమ్మతోటలోకి లాక్కెళ్లి లైంగిక దాడి చేశాడు. ఆమె ఈ విషయాన్ని భర్తకు చెప్పి న్యాయం చేయాలని పెద్దల వద్దకు వెళ్లింది. వారు ఏమీ చేయలేమని చెప్పడంతో శుక్రవారం సాయంత్రం ఈ ఘటనపై ముసునూరి పోలీసులను ఆశ్రయించింది.

యువకుడి ఆత్మహత్య

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలోని ఆదివారపుపేట మసీదు రోడ్డు ప్రాంతానికి చెందిన ఒక యువకుడు తీవ్ర మానసిక వేదనతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారపుపేట మసీదురోడ్డు ప్రాంతానికి చెందిన షేక్ రెహమాన్ (21) మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతని తల్లిదండ్రులు కొన్నేళ్ల క్రితం మరణించగా అమ్మమ్మ వద్దనే ఉంటూ నగరంలోని ఒక షోరూమ్‌లో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. కానీ కొద్ది నెలల కిత్రం అమ్మమ్మ కూడా మృతి చెందడంతో ఇంట్లో ఒంటరిగా జీవిస్తున్నాడు. మానసిక ఆందోళన, జీవితంపై విరక్తి పెంచుకున్న రెహమాన్ ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో ఏలూరు టూటౌన్ సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. యువకుడు రెహమాన్ మృతదేహానికి ఏలూరు జీజీహెచ్ మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా

- అక్రమార్కులకు అడ్డాగా కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం రూరల్ ప్రాంతాలు
- చెరువుల గట్లు సైతం మాయం
- అధికారులకు సమాచారం ఇచ్చినా చర్యలు శూన్యం


కొయ్యలగూడెం మండలం ఏడువాడలపాలెం సమీపంలో వ్యవసాయ భూమిలోని మట్టిని అనుమతులు లేకుండా తరలిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం/జంగారెడ్డిగూడెం రూరల్ : అక్రమంగా చేస్తున్న మట్టి రవాణాకు కొయ్యలగూడెం రూరల్, జంగారెడ్డిగూడెం రూరల్ ప్రాంతాలు ప్రాంతాలు అక్రమార్కులకు అడ్డాగా మారాయి. శుక్రవారం జేసీబీలను ఏర్పాటు చేసి భారీ ఎత్తున అక్రమార్కులు యథేచ్ఛగా మట్టిని టిప్పర్ల ద్వారా తరలించారు. దీనిపై సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని కృష్ణపాలెం, ఏడువాడలపాలెం రైతులు ఆరోపిస్తున్నారు. గత వారం నుంచి రాత్రి వేళల్లో అక్రమార్కులు జేసీబీలను ఏర్పాటు చేసుకుని టిప్పర్ల ద్వారా వందలాది ట్రక్కులను తరలిస్తున్నారన్నారు. టిప్పర్ల తరలింపుతో రోడ్లు అధ్వానంగా మారాయని, దుమ్ము, దూళి పైకి ఎగిసి ఇళ్లలోకి జొరబడుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులకు మట్టి అక్రమార్కులకు వాగ్వివాదం జరగడంతో మధ్యవర్తులు ప్రవేశించి టిప్పర్లు వెళ్లే దారిని నీటి ట్యాంకర్ల ద్వారా తడిపి దుమ్ము ఎగిసి పడకుండా చేసేలా మధ్యవర్తిత్వం వహించారు. టిప్పర్ మట్టిని ఐదు వేల రూపాయలకు పరిసర ప్రాంతాలకు, జిల్లాలోని ఇతర ప్రాంతాలకు విక్రయిస్తూ అక్రమ రవాణాదారులు లబ్ధి పొందుతున్నారు. స్థానికంగా ట్రాక్టర్ ట్రక్కులను ఏర్పాటు చేసి వందలాది ట్రక్కుల మట్టిని అమ్ముకుంటున్నారు. జంగారెడ్డిగూడెం మండలం కృష్ణంపాలెం సమీపంలోని నందనాల చెరువు గట్టు తవ్వి భారీ ఎత్తున మట్టి విక్రయాలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

వచ్చేది మా ప్రభుత్వమేనని బెదిరింపులు

మట్టి తవ్వకాల వల్ల చెరువులో భారీగా గోతులు ఏర్పడ్డాయని లోతు తెలియక దిగవడం వల్ల గతంలో మనుషులు ప్రాణాలు కూడా కోల్పోయారని కేతవరం రైతులు ఆరోపించారు. అదేవిధంగా పశువులు భారీ గోతులలో పడి ప్రాణాలు కోల్పోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మట్టి అక్రమ రవాణా పై నిలదీస్తుంటే ఓ సామాజిక వర్గానికి చెందిన వారిని తమపై ఉసిగొలుపుతూ కేసులు బనాయిస్తున్నారని, వచ్చేది మా ప్రభుత్వం (కూటమి) అంటూ బెదిరిస్తున్నారని అధికారులు సైతం వారికే కొమ్ముకాస్తున్నారు అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మట్టి మాఫియాకి పేరుపడ్డ కొయ్యలగూడెం మండలం గవరవరం, పొంగుటూరు గ్రామానికి చెందిన వ్యక్తులు మట్టి తరలింపులో ప్రధాన పాత్ర వహిస్తున్నారని అన్నారు. ఏడు నుంచి ఎనిమిది యూనిట్ల వాహనాలు పుంత రోడ్ల వెంబడి వెళ్లడంతో భారీ గోతులు ఏర్పడ్డాయని పండిన పంట ధాన్యాన్ని గమ్యస్థానాలకు చేరవేయలేక పోతున్నామని రైతులు దిగులు చెందుతున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి అక్రమ మట్టి తరలింపును అడ్డుకోవాలని రైతులు కోరుతున్నారు.


జంగారెడ్డిగూడెం మండల పరిధి నందనాల చెరువులో మట్టిని తోలడం వల్ల ఏర్పడిన భారీ గొయ్యి

ఆకట్టుకున్న జాతీయస్థాయి నాటిక ప్రదర్శనలు

భీమవరం : పట్టణంలో చైతన్యభారతి సంగీత, నృత్య, నాటక పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి సాంఘిక నాటక పోటీలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. స్థానిక డీఎన్నార్ ఇంగ్లిషు మీడియం స్కూల్ ఆవరణలో ఏర్పాటుచేసిన కళావేదికపై శుక్రవారం మూడు నాటికలు ప్రదర్శించారు. మొదటిగా హైదరాబాద్ కళాంజలి నాటకసంస్థ ఆధ్వర్యంలో ఎస్.రవీంద్ర రెడ్డి దర్శకత్వంలో ప్రదర్శించిన ‘రైతేరాజు’నాటిక రైతులు పడుతున్న కష్టాలను కళ్లకు కట్టినట్లు చూపించారు. రెండో ప్రదర్శనగా తాడేపల్లి వారి అరవింద ఆర్ట్స్ ఆధ్వర్యంలో గంగోత్రి సాయి దర్శకత్వంలో ‘మనస్విని’నాటిక డబ్బుకంటే మానవ సంబంధాలే ఎంతో ఎన్నతమైనవి తెలియజేసింది. మూడో ప్రదర్శనగా కత్రపాడు ఉషోదయ కళానికేతన్ ‘విముక్తి’నాటికను చెఱుకూరి సాంబశివరావు దర్శకత్వంలో ప్రదర్శించారు. ఆయా కార్యక్రమాలను చైతన్యభారతి పరిషత్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రాయప్రోలు భగవాన్, మంతెన రామకుమార్‌రాజు, రాయప్రోలు శ్రీనివాసమూర్తి, భట్టిప్రోలు శ్రీనివాసరావు, పేరిచర్ల లక్ష్మణవర్మ తదితరులు పర్యవేక్షించారు.


భీమవరంలో ప్రదర్శించిన రైతేరాజు నాటికలో సన్నివేశం



క్లుప్తంగా

145 మందికి ఎముక దృఢత్వ పరీక్షలు



ఉచిత వైద్య శిబిరంలో సేవలందిస్తున్న సిబ్బంది

తణుకు అర్బన్ : టొరంటో ఫార్మా సిగ్మా డివిజన్ సౌజన్యంతో డాక్టర్ వీఎస్ఎన్ రాజు (ఎక్స్ మిలిటరీ) ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక సత్యనారాయణ నర్సింగ్ హోంలో నిర్వహించిన శిబిరంలో 145 మందికి ఎముక దృఢత్వ (బీఎండీ) పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వి.సత్యనారాయణరాజు ఆర్థిక సాయంతో రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేసి, తగు జాగ్రత్తలు సూచించారు. రోగులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వి.శ్రీనివాసరాజు, అమూల్య మెస్ రాజు, రోగులు పాల్గొన్నారు.

ఘనంగా సూపర్ స్టార్ కృష్ణ జయంతి



చలివేంద్రంలో మజ్జిగను పంపిణీ చేస్తున్న సూపర్ స్టార్ కృష్ణ అభిమానులు

తణుకు టౌన్: సూపర్ స్టార్ కృష్ణ జయంతి వేడుకలను ఆయన అభిమానులు శుక్రవారం తణుకు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం తణుకు తాలూకా సూపర్ స్టార్ కృష్ణ, ప్రిన్స్ మహేశ్ బాబు యూత్ గౌరవ అధ్యక్షుడు నమ్మి వాసు ఆధ్వర్యంలో తణుకులోని బాలాజీ టింబర్ డిపో వద్ద సూపర్ స్టార్ కృష్ణ పుట్టిన రోజు కేక్‌ను కట్ చేశారు. ఈసందర్భంగా కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ఫ్యాన్స్ నాయకులు నమ్మి సతీష్, నాగభూషణం, కత్ర కృష్ణ తదితరులు పాల్గొన్నారు. తణుకు సజ్జాపురంలో కృష్ణ, మహేశ్ బాబు యూత్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రయాణీకులకు నిమ్మ రసం, మజ్జిగను పంపిణీ చేశారు. ఈసందర్భంగా సూపర్ స్టార్ కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో సజ్జాపురం ఏసు, కే కోటేశ్వరరావు, మల్లేశ్వరరావు, దుర్గారావు, బీ మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గజ్జెల పూజ



గజ్జెల పూజలో మహిళల కోలాట ప్రదర్శన దృశ్యం

తణుకు టౌన్: పట్టణంలో పైడిపర్రులోని బాల వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి గజ్జెల పూజ ఘనంగా నిర్వహించారు. పైడిపర్రులో నూతనంగా ఏర్పాటైన బాల బాలాజీ మహిళల కోలాటం భజన గ్రూపు చెందిన 110 మందితో గజ్జెల పూజను ఘనంగా నిర్వహించారు. కోలాటం గురువు తిరుపతి రావు ఆధ్వర్యంలో కోలాటం గ్రూపు ఆలయంలో గజ్జెల పూజ ప్రదర్శనను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కోలాటం భజన గ్రూపుకు సంబంధించిన మహిళలతో పాటు భక్తులు పాల్గొన్నారు.

పదోతరగతి సప్లిమెంటరీ సోషల్ పరీక్ష ప్రశాంతం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి శుక్రవారం ఏడోవ రోజున సోషల్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పట్టణంలోని ఏడు స్కూల్స్ జెడ్పీ ఉన్నత పాఠశాల, కడకట్ల మునిసిపల్ హైస్కూల్, సుబ్బారావుపేట మునిసిపల్ హైస్కూల్, కింబర్లీ, మాంటిస్సోరి, సెంట్ జోన్స్, భాష్యం స్కూల్‌లో పరీక్షలు జరిగాయి. 461 మంది విద్యార్థులకు గాను 164 మంది పరీక్షలకు హాజరయ్యారు. 297మంది పరీక్షలకు హాజరు కాలేదు.

చిన్నారులకు పండ్లు, మిఠాయిల పంపిణీ

పాలకొల్లు అర్బన్: సూపర్‌స్టార్ కృష్ణ పుట్టిన రోజు వేడుకలను అంజలి మానసిక వికలాంగుల పాఠశాలలో శుక్రవారం ఫ్యాన్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కృష్ణ, మహేష్‌బాబు యువసేన ఆధ్వర్యంలో గౌరవాధ్యక్షుడు మేడికొండ శ్రీనివాస్ చౌదరి కేక్ కట్ చేసి చిన్నారులకు తినిపించారు. చిన్నారులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు అభిమానులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ

పెనుగొండ: మండుటెండలతో అవస్థలు పడుతున్న ఉపాధి కూలీలకు జడ్డి బీరా శ్రీనివాస్ అండగా నిలిచారు. పెనుగొండ మండలం ములపర్రులో సుమారు 270 మంది ఉపాధి కూలీలు చెరువు పనులు చేస్తున్నారు. వీరికి ములపర్ర గ్రామం సీతారాముని చెరువుకు చెందిన న్యాయమూర్తి బీరా శ్రీనివాస్ సహకారంతో శుక్రవారం మంచినీరు, మజ్జిగ, శీతల పానీయాలు అందించారు.

క్షణం ఒక యుగంలా..!

- రోజు రోజుకూ పెరుగుతున్న ఉత్కంఠ
- అందరి దృష్టీ లెక్కింపు రోజు పైనే
- ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు ముమ్మరం



భీమవరంలో తణుకు నియోజకవర్గానికి సంబంధించిన ఏర్పాట్లు

తణుకు: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సమయం కౌంటింగ్ దగ్గర పడుతోంది. తణుకు నియోజకవర్గంలో పోటీ చేసిన అభ్యర్థులే కాదు... ఓటు వేసిన ఓటర్లు సైతం జూన్ 4న జరిగే ఓట్లు లెక్కింపు రోజు కోసం ఒళ్లంతా కళ్లు చేసుకుని ఎదురు చూస్తున్నారు. నియోజకవర్గంలోని ఏ నలుగురు కలిసినా మాటలన్నీ ఎన్నికల ఫలితాల కబుర్లే అవుతున్నారు. సార్వత్రిక ఓట్ల లెక్కింపు సమీపిస్తున్న కొద్దీ అందరిలో ఉత్కంఠ పెరుగుతోంది. ఇన్నాళ్లూ వివిధ లెక్కలతో వివిధ రూపాల్లో చేయించిన సర్వేలతో గడిపిన నేతల్లో లెక్కింపు ప్రక్రియ దగ్గర పడుతుండటంతో ప్రతిఒక్కరిలో కౌంట్ డౌన్ టెన్షన్ పెరుగుతోంది. మరోవైపు లెక్కింపునకు అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఎలాంటి లోపాలు తలెత్తకూడదని, అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకూడదని ఒకటికి రెండు సార్లు సమీక్షిస్తున్నారు. ప్రతి రోజూ సమావేశాలు నిర్వహించి సిబ్బందిని సమాయత్తం చేస్తున్నారు. ఇంకోవైపు ఓట్లు నిక్షిప్తమై ఉన్న ఈవీఎం, వీవీ ప్యాట్‌లు ఉన్న స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన భారీ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

మరో రెండ్రోజులు మాత్రమే...

సార్వత్రిక ఎన్నికలు ముగిసి 18 రోజులు అవుతోంది. లెక్కింపునకు మరో రెండు రోజులే మిగిలి ఉంది. తణుకు నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలు, వీవీ ప్యాట్లు భీమవరంలోని విష్ణు కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌ల్లో ఉన్నాయి. మొత్తం 233 బూత్‌లకు సంబంధించి 14 టేబుళ్లు ఏర్పాటు చేసి 17 రౌండ్లలో లెక్కింపు పూర్తి చేసేలా చర్యలు చేపట్టారు. ఇదిలా ఉంటే ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులకే కాదు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు కూడా టెన్షన్ పెరుగుతోంది. కౌంటింగ్ సమయం దగ్గర పడుతుండటంతో ఏమవుతుందోనన్న ఉత్కంఠ పెరుగుతోంది. గ్రామాలు, వార్డుల వారీగా తమకెన్ని ఓట్లు వస్తాయోనని ఆయా పార్టీలు లెక్కలేసుకుంటున్నాయి. ఇప్పటికే కావాల్సిన వారితో సర్వే చేయించుకున్నాయి. ఇవి కూడా పోలింగ్ అనంతరం వివిధ ప్రైవేటు సంస్థలు చేసిన సర్వేలను చూసుకున్నాయి. దీంతో కొందరు ఉపశమనం పొందగా, మరికొందరు టెన్షన్‌కు లోనవుతున్నారు. చాలా మంది నాయకులు కాస్త సేద తీరేందుకు వివిధ ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఇప్పుడు వారంతా నియోజకవర్గాలకు చేరుకుంటుండటంతో వారి వద్దకు అనుచరులు చేరుకుని మళ్లీ లెక్కలేసుకుంటున్న పరిస్థితి నెలకుంది. దీంతో అభ్యర్థులకు ఉత్కంఠ మరింత పెరిగిపోతోంది.

విద్యార్థులకు రుచిగా భోజనం అందించాలి



తణుకులో మధ్యాహ్న భోజన కార్మికులను బహుమతులు అందజేస్తున్న దృశ్యం

తణుకు, తణుకు అర్బన్: మధ్యాహ్న భోజన పథక కార్మికులంతా విద్యార్థులకు అందించే భోజనాన్ని శుచి, శుభ్రతతో అందించాలని తణుకు మండల విద్యాశాఖాధికారి వి.హైమావతి పేర్కొన్నారు. తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో శుక్రవారం మధ్యాహ్న భోజన పథక కార్మికులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులందరికీ పోషకాహారాన్ని అందించాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. ముందుగా విద్యాశాఖాధికారులు సూచించిన ప్రకారం మధ్యాహ్న భోజన పథక వీడియోలు చూపించి ప్రతి వంటకం ఎలా చేయాలో వివరిస్తూ, పీపీటీలను స్మార్ట్ టీవీల ద్వారా ప్రయోగాత్మకంగా చూపించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏకె.సరళ ట్రైనీగా, అసిస్టెంట్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్‌గా కే.పద్మావతి, ఆర్పీగా పెదపాటి గోపాలకృష్ణ వ్యవహరించారు. అనంతరం మధ్యాహ్న భోజన కార్మికులను బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు, మండల విద్యాశాఖ సిబ్బంది, మధ్యాహ్న భోజన పథక కార్మికులు పాల్గొన్నారు.

ఆహారపదార్థాలు నాణ్యంగా ఉండాలి

ఇరగవరం: పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద ఆహార పదార్థాలు రుచిగా, శుచిగా ఉండాలని మండల విద్యాశాఖ అధికారి-2 జీవీబి ప్రసాద్ తెలిపారు. మండలంలోని వంట ఏజెన్సీ నిర్వాహకులకు గోరుముద్దకు సంబంధించి ఆహార పదార్థాలు తయారు చేయడంతో వంటల పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ధ్యేయంతో ప్రభుత్వం మధ్యాహ్న భోజనానికి పలురకాల పదార్థాలు అందజేస్తుందన్నారు. వీటిని శుచిగా, రుచికరంగా వండడంలో ఏజెన్సీల నిర్వాహకులు నైపుణ్యం చూపాలన్నారు. అనంతరం వంటలపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అమ్మాజీ, కె సత్యనారాయణ, పివై పోలారావు, ఆర్ పాపరావు, ఓడురి శ్రీనివాసరావు, హెచ్ఎంలు పార్వతీశం సీఆర్పీలు, ఐఇఆర్పిలు, ఎంఆర్సీలు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిగుండం



వెలవెలబోతున్న తణుకులోని రాజీవ్ చౌక్ సెంటర్



నిర్మానుష్యంగా దర్శనమిస్తున్న జాతీయ రహదారి



ఖాళీగా దర్శనమిస్తున్న వేల్పూరు రోడ్డు

- తణుకులో అప్రకటిత కర్ఫ్యూ
- రోహిణీ కార్తె ప్రభావం
- ప్రచండంగా చెలరేగుతున్న సూర్యుడు

తణుకు: తెలవారుతుండగానే ఉదయ భానుడు చెలరేగిపోతున్నాడు... ఉదయం పది గంటలు దాటకుండానే సూర్యుడు అగ్ని వర్షం కురిపిస్తున్నాడు. బయటకు వెళ్లినా.. ఇంట్లో ఉన్నా భగభగలాడుతున్న ఎండ, వేడి గాలులకు తాళలేక ప్రజలు ఆపసోపాలు పడుతున్నారు. పొద్దుపొద్దున్నే మొదలవుతున్న వేడి గాలులు రాత్రి అయినా ఉపశమించకపోవడంతో అల్లాడిపోతున్నారు. రోహిణీ కార్తె ప్రారంభమై వారం రోజులైంది. నాటి నుంచి శుక్రవారం వరకూ 40 డిగ్రీల పైబడిన ఉష్ణోగ్రతలు నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. శుక్రవారం మాత్రం 45 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదు కావడంతో తణుకులోని అప్రకటిత కర్ఫ్యూ నెలకొంది. జాతీయ రహదారితోపాటు పట్టణంలోని ప్రధాన రోడ్లు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. ప్రధాన రోడ్ల వెంబడి తోపుడు బండ్లు, చిన్నచిన్న వ్యాపారులు మధ్యాహ్న సమయంలో దుకాణాలు మూసివేసి, సాయంత్రం తెరుస్తున్నారు. మరోవైపు ఎండలకు విద్యుత్ వినియోగం పెరిగిపోయింది. ఫ్యాన్లు, ఏసీలు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి అనే తేడా లేకుండా పని చేస్తూనే ఉన్నాయి. ఫ్యాన్ కింద కూర్చున్నా సరే వేడి గాలే రావడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. రాత్రి వేళ్లలో ఆరుబయట నిద్ర పోతున్నా, ఫ్యాన్ పెట్టుకున్నా ఉక్కపోత వీడక ఆపసోపాలు పడుతున్నారు.



జనం లేకపోవడంతో నిర్మానుష్యంగా వెంకటేశ్వర థియేటర్ సెంటర్



నిత్యం రద్దీగా ఉండే కప్పల వెంకన్న సెంటర్ ఇలా...

దోమ పుట్టుకను నివారించాలి



డ్రైడే ఫ్రైడే ర్యాలీ నిర్వహిస్తున్నఆరోగ్య సిబ్బంది

తణుకు అర్బన్: దోమ పుట్టుకను నిరోధిస్తే వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చని వెక్టార్ బోర్న్ డీసీజెస్ కంట్రోల్ సబ్ యూనిట్ ఆఫీసర్ గుడిమెట్ల వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు ఇరగవరం రోడ్డులో శుక్రవారం నిర్వహించిన డ్రైడే, ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. ప్రజలంతా తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు డ్రెయిన్‌లలో వ్యర్థాలను పారవేయకుండా చూసుకోవాలని సూచించారు. దోమ పెట్టే లార్వా 8 నుంచి 10 రోజుల్లోపు దోమగా మారుతుందని, అందువలన వారానికోసారి ఇంటి పరిసరాల్లో అవసరంలేని నీటి నిల్వలతోపాటు ఇంటి ఆవరణల్లోని రుబ్బురోళ్లు, కూలర్‌లు, రిఫ్రిజిరేటర్స్‌ను శుభ్రం చేసుకోవాలని తెలిపారు. దోమల ఆవాసాలుగా ఉండే ప్రాంతాలను శుభ్రం చేస్తే దోమ పుట్టుకను నివారించుకోవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో ర్యాలీ నిర్వహించి పరిశుభ్రతపై అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు హెల్త్ సెక్రటరీలు, వై.మౌనిక, హెల్త్ అసిస్టెంట్స్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమవరం వెళ్లేందుకు అనుమతి లేదు



తణుకులో మాట్లాడుతున్న రూరల్ సీఐ నాగేశ్వరరావు

తణుకు: జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో భీమవరం వెళ్లేందుకు కౌంటింగ్ ఏజెంట్లకు మినహాయించి ఎవరికీ అనుమతి లేదని తణుకు రూరల్ సీఐ జీవీవీ నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం తణుకులో ఆయన మీడియాతో మాట్లాడారు. కౌంటింగ్ సందర్భంగా తణుకు నియోజకవర్గంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని హెచ్చరించారు. ముఖ్యంగా ఆ రోజు బాణాసంచా కాల్చడం, ఊరేగింపులు నిర్వహించడం నిషిద్ధమన్నారు. లాడ్జిల్లో బయటి వ్యక్తులు రాకుండా ఇప్పటికే ఆయా యజమానులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పెట్రోలు సైతం బాటిళ్లలో పోయకుండా బంకుల యజమానులు జాగ్రత్తలు వహించాలన్నారు. జూన్ 6 వరకు ఎన్నికల్ కోడ్ అమల్లో ఉన్నందున అభ్యర్థులతోపాటు ఆయా పార్టీల ద్వితీయ శ్రేణి నాయకులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తణుకు రూరల్ ఎస్సై కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

తాడేపల్లిగూడెం అర్బన్: జూన్ నాలుగో తేదీన ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో అల్లర్లు, గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సూర్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ గూడెంలో ప్రశాంతమైన వాతావరణంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసిందని, జూన్ నాలుగో తేదీన ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను సజావుగా సాగేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టామని చెప్పారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రజలు సహకరించాలని కోరారు.

పొగాకు రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలి



వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ వద్ద ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ దృశ్యం



అత్తిలి ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

తాడేపల్లిగూడెం రూరల్: పొగాకు రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని వెంకటరామన్నగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీహర్ష అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన ర్యాలీ, ప్రతిజ్ఞ చేశారు. డాక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల పరిశ్రమల్లో పనికి వెళ్లేవారు జాగ్రత్తగా ఉండాలని, చిన్న పిల్లల్ని ఈ పరిశ్రమకు దూరంగా ఉంచే బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో సూర్యకాంతం, హెచ్‌వీ జ్యోతి, హెచ్ఎస్ లక్ష్మణ్, ఫార్మాసిస్ట్ రామారావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ధూమపానానికి దూరంగా ఉండండి

అత్తిలి: ధూమపానం అలవాటు మనిషి రక్తకణజాలం, మెదడుపై చెడు ప్రభావం చూపెడుతుందని మంచిలి పీహెచ్‌సీ వైద్యాధికారి పి కిరణ్ అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మంచిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శుక్రవారం చైతన్యసదస్సు నిర్వహించి, ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా వైద్యాధికారి కిరణ్ మాట్లాడుతూ పొగాకు అలవాటు మనిషిలోగల అంతర్గత అవయవ వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. మనిషి ప్రశాంత వాతావరణానికి అలవాటు పడటం ద్వారా నికోటిన్ వాడకాన్ని దూరం చేయవచ్చన్నారు. పీహెచ్ఎన్ పి శూచర్ల, ఎంపీహెచ్ఈవో కె శాంతమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

కిశోర బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



కె.సముద్రపుగట్టులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

అత్తిలి: కిశోర బాలికలు సమతుల ఆహారాన్ని తీసుకోవడం ద్వారా రుతుక్రమం సక్రమంగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.కుమారి తెలిపారు. అత్తిలి మండలం కె.సముద్రపుగట్టు గ్రామంలో శుక్రవారం రుతుస్రావం పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని యుక్త వయస్సు పిల్లలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు ఆకుకూరలు, గుడ్లు, పాలు వంటి సమతుల ఆహారాన్ని తీసుకుంటే రుతుక్రమం సక్రమంగా ఉంటుందన్నారు. రక్తహీనత ఉన్నవారికి రుతక్రమం ఆగుతుందని, దీని నివారణకు పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.భవాని, దీపికారాణి, నవోమి, పూర్ణగిరి, లక్ష్మీ రమ్య, తల్లులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

ఉరదాళ్లపాలెంలో..

కిశోర బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని అంగన్‌వాడీ కార్యకర్త నీతిపూడి వెంకటలక్ష్మి అన్నారు. అత్తిలి మండలం ఉరదాళ్లపాలెం అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో రుతుక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నాగజ్యోతి, రాధ, కిశోర బాలికలు పాల్గొన్నారు.


కరాటే పోటీల్లో తణుకు క్రీడాకారుల ప్రతిభ



అంతర్జాతీయ కరాటే పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్ శ్రీనివాస్

తణుకు అర్బన్: అంతర్జాతీయ కరాటే పోటీల్లో తణుకు కేఎస్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ క్రీడాకారులు సత్తాచాటి బంగారు పతకాలు సాధించారు. నేపాల్‌లోని పొఖ్రా సిటీలో ఈ నెల 23 నుంచి 25 వరకు నిర్వహించిన కరాటే పోటీల్లో అకాడమీ తరపున 12 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు అకాడమీ కోచ్, గ్రాండ్ మాస్టర్ కేతా శ్రీనివాస్ తెలిపారు. సబ్ జూనియర్ విభాగంలో కె.అక్షయ, జె.వైష్ణవి, పి.తమోఘ్నేష్, కె.రుత్విక్ శ్రీరామ్, బి.వైష్ణవి, సీహెచ్ రుత్విక్ వర్మ బంగారు పతకాలు, పి.తేజ్ కార్తికేయ వెండి పతకం, జూనియర్ విభాగంలో కె.లలిత, ఐ.దేదీప్య బంగారు, కె.షర్మిల రాణి వెండి, సీనియర్ విభాగంలో బి.నాగపండు, కె.సిద్ధార్థ బంగారు పతకాలు సాధించినట్లు వివరించారు. అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రపంచ వ్యాప్తంగా క్రీడాకారులతో పోరాడి పతకాలు సాధించిన అకాడమీ క్రీడాకారులను పలువురు ప్రముఖులు అభినందించారు.

కేపీపాలెం నార్త్‌లో పంట బోదెల తవ్వకాలు



పంటబోదె తవ్వుతున్న ఉపాధి కూలీలు

మొగల్తూరు: తీర ప్రాంత గ్రామాలైన కేపీ పాలెం నార్త్, సౌత్, పేరుపాలెం నార్త్, సౌత్ గ్రామాల్లో పంట బోదె తవ్వకాలు చురుగ్గా సాగుతున్నాయి. వ్యవసాయ పనులు పూర్తి కావడంతో చెరువులను పూర్తి స్థాయిలో నింపారు. కొబ్బరి, సరుగుడు, మామిడి తోటలకు పూర్తి స్థాయిలో నీరు అందేలా పంట బోదెల తవ్వకాలు చేపట్టారు. శుక్రవారం కేపీపాలెం సౌత్ గ్రామంలోని ప్రధాన పంటబోదెలో గుర్రపు డెక్క, మట్టి మేటలు వేయడంతో వాటిని తొలగించేందుకు పంట బోదె తవ్వకాలు చేపట్టారు. అధికారుల ఆదేశాల మేరకు నీరు వృథా కాకుండా తోటలకు నీరందేలా పంట బోదెలు తవ్వకాలు చేపట్టామని టీఏ వెంకటేశ్వరరావు తెలిపారు.

పచ్చి రొట్ట పెంపకంతో నేల సారవంతం

మొగల్తూరు: పచ్చి రొట్ట పెంపకం ద్వారా అనేక ప్రయోజనాలున్నాయని మండల వ్యవసాయాధి కారి అబ్దుల్ రహీమ్ శుక్రవారం తెలిపారు.మినుము, పిల్లిపెసర, జీలుగ పెంపకం ద్వారా నేలకు మేలు చేసే సూక్ష్మ జీవులు వృద్ధి చెందుతాయన్నారు. పైరుకు రోగ నిరోధక శక్తిని పెంచడంతో పాటు నేల ద్వారా సంక్రమించే తెగుళ్లను అరికడతాయన్నారు. పచ్చి రొట్ట వల్ల వరికి పూర్తి స్థాయిలో నత్రజని అందుతుందన్నారు. పచ్చి రొట్ట పైర్లను పూత దశలో నేలలో కలిపి దున్నడం వల్ల మొక్కలకు నత్రజని, పొటాష్ అందుతుందన్నారు.ఎకరాకు జనుము 16 కేజీలు వాడితే మంచి పోషకాలు అందుతాయన్నారు.